సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం | 4 | సెప్టెంబర్ | 2025



వడివడిగా అడుగులు - IIలో▸
గీసుకొండ–సంగెం మండలాల పరిధి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మరో రెండు ప్రధాన కంపెనీలు తమ ఉత్పత్తులు ప్రారంభించేలా అడుగులు వేస్తున్నాయి.



'మల్లన్నగండి' నిర్మాణం అద్భుతం
మల్లన్నగండి కుడి కాల్వ నిర్మాణం అద్భుతమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం ఎంపీ కావ్యతో కలిసి మల్లన్నగండి కుడి కాల్వను ప్రారంభించారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
31⁰/24⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

నిమజ్జనానికి సిద్ధం

సంపూర్ణ చంద్రగ్రహణం ఆదివారం సంభవిస్తున్నందున, గురువారంతో నవరాత్రులు పూర్తవుతున్నందున వారంతో సంబంధం లేకుండా గణపతుల నిమజ్జనం రేపు (శుక్రవారం) నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్‌లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. చంద్ర గ్రహణం కారణంగా దేవాలయాల్లో ఆదివారం మధ్యాహ్నం 12గంటల్లోపు నివేదనలు జరిపి మూసివేసి, తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణలు నిర్వహించిన అనంతరం యథావిధి పూజాకార్యక్రమాలు జరుపుకోవాలని రాష్ట్ర అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, నిమజ్జనం సందర్భంగా గ్రేటర్ వరంగల్ పరిధి పలురూట్లలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అదేవిధంగా విగ్రహాలు నిమజ్జనం చేసే చెరువులు, రూట్లలో పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులు, ఇతర సదుపాయాల నిమిత్తం ప్రత్యేక అధికారులను నియమిస్తూ బల్దియా కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.



గ్రేటర్ పరిధిలో చకచకా ఏర్పాట్లు
- రేపు (శుక్రవారం) గణపతుల నిమజ్జనం
- నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: వినాయక నిమజ్జనం సందర్భంగా ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 7వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు వరంగల్ ట్రై సిటీ పరిధిలో భారీ వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం వెల్లడించారు. ఈ మేరకు ట్రాఫిక్ మళ్లింపు వివరాలను మీడియాకు వెల్లడించారు. నిమజ్జనం రోజున శోభాయాత్ర వెళ్లే మార్గంలో, నిమజ్జనం జరిగే ప్రదేశాల్లో వాహనాలు రోడ్డుపై నిలుపరాదని, ఈ విషయంలో ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.



వినాయక విగ్రహాల నిమజ్జనానికి హనుమకొండ సిద్ధేశ్వర గుండంలోని మట్టిని తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...
- ములుగు – భూపాలపల్లివైపు నుంచి వచ్చే భారీ వాహనాలు హైదరాబాద్‌కు ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వెళ్లాలి.
- భూపాలపల్లి – పరకాల నుంచి ఖమ్మం వెళ్లాల్సినవి ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కి కరుణాపురం– వెంకటాపురం–ఐనవోలు–పున్నేలు క్రాస్ రోడ్డు మీదుగా ఖమ్మం రోడ్డు ఎక్కి వెళ్లాలి.
- భూపాలపల్లి – పరకాల నుంచి వచ్చే వాహనాలు నర్సంపేట వైపునకు కొత్తపేట – రెడ్డిపాలెం – జాన్‌పీరీలు–గొర్రెకుంట నుంచి వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి ఖమ్మం వైపు వెళ్లే భారీ వాహనాలు చింతగట్టు వద్ద ఓఆర్‌ఆర్ ఎక్కి యూటర్న్ తీసుకొని కరుణాపురం – వెంకటాపూర్ – ఐనవోలు– పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద ఖమ్మం రోడ్డు ఎక్కి వెళ్లాలి.
- ఖమ్మం నుంచి కరీంనగర్ – హైదరాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలు పున్నేలు క్రాస్ రోడ్డు– ఐనవోలు ఆర్చి–వెంకటపూర్– కరుణాపురం మీదుగా వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే భారీ వాహనాలు కరుణాపురం – వెంకటాపూర్–ఐనవోలు– పున్నేలు క్రాస్ రోడ్డు నుంచి ఖమ్మం వెళ్లాలి.
- నిమజ్జన సమయంలో సిటీ లోపలికి భారీ వాహనాలకు అనుమతి లేదని, నగరం అవతలే నిలుపుకోవాలి.
- హైదరాబాద్ నుంచి నర్సంపేట వైపు వెళ్లే భారీ వాహనాలు కరుణాపురం నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా వచ్చి ఆరెపల్లి వద్ద దిగి కొత్తపేట– రెడ్డిపాలెం – జాన్‌పీరీలు– గొర్రెకుంట మీదుగా వెళ్లాలి.
- నర్సంపేట వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు గొర్రెకుంట – జాన్‌పీరీలు– రెడ్డిపాలెం– కొత్తపేట – ఓఆర్‌ఆర్ మీదుగా ప్రయాణించాలి.

నగరంలో తిరిగే అన్ని రకాల వాహనాలకు..
- ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే బస్సులు వయా పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ, సీపీఓ, అంబేడ్కర్ సెంటర్, ఏషియన్ శ్రీదేవి మాల్ మీదుగా బస్టాండ్ చేరుకోవాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి బయల్దేరి ములుగు, కరీంనగర్ వెళ్లాల్సిన బస్సులు వయా ఏషియన్ శ్రీదేవి మాల్, అంబేడ్కర్ సెంటర్, సీపీఓ ద్వారా కేయూసీ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి బయల్దేరి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపు వెళ్లే బస్సులు వయా బాలసముద్రం, అదాలత్, హంటర్ రోడ్డు మీదుగా వెళ్లాలి.
- వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండ వైపు వచ్చే బస్సులు చింతల్‌బ్రిడ్జి నుంచి రంగశాయిపేట మీదుగా నాయుడు పెట్రోల్ పంప్ సెంటర్, ఉర్సు గుట్ట, అదాలత్, బాలసముద్రం మీదుగా హనుమకొండకు చేరుకోవాలి.
- కాజీపేట నుంచి వరంగల్ వైపు వెళ్లాల్సిన కార్లు, ఇతర చిన్న వాహనాలు ఫాతిమా జంక్షన్, వడ్డేపల్లి చర్చి, కేయూసీ జంక్షన్, పెద్దమ్మగడ్డ, ములుగు రోడ్డు, ఎంజీఎం, జెమిని, పోతన జంక్షన్, అండర్ బ్రిడ్జి, హెడ్ పోస్టాఫీస్, వరంగల్ బస్టాండ్, వెంకట్రామ మీదుగా ప్రయాణించాలి.
- వరంగల్ నుంచి కాజీపేట వైపు వెళ్లాల్సిన వాహనాలు వెంకట్రామ, వరంగల్ బస్టాండ్, హెడ్ పోస్టాఫీస్, అండర్ బ్రిడ్జి, పోతన జంక్షన్, జెమిని, ఎంజీఎం, ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ జంక్షన్, వడ్డేపల్లి చర్చి, ఫాతిమా జంక్షన్ మీదుగా ప్రయాణించాలి.

వినాయక నిమజ్జన వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు
- సిద్ధేశ్వర గుండంలో నిమజ్జనం చేసిన తర్వాత వాహనాలు శాయంపేట వైపు వెళ్లే రోడ్డు ద్వారా ఎగ్జిట్ అవ్వాలి.
- శాయంపేట వైపు నుంచి వచ్చే వినాయక విగ్రహ వాహనాలు వయా హంటర్‌రోడ్డు, అదాలత్, హనుమకొండ చౌరస్తా మీదుగా ప్రయాణించాలి.
- ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, వడ్డేపల్లి ప్రాంతాల నుంచి వచ్చే వినాయక విగ్రహాలు అన్ని బంధం చెరువులో నిమజ్జనం చేయాలి.
- చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జనం చేసిన వాహనాలు ఏనుమాముల రోడ్డు నుంచి నర్సంపేట రోడ్డు వైపునకు వెళ్లాలి.

గణేష్ నిమజ్జన కేంద్రాలకు అధికారుల నియామకం

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర వ్యాప్తంగా జరగనున్న గణేష్ నిమజ్జన చెరువుల వద్ద ఇన్‌చార్జ్ అధికారులను నియమిస్తూ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో 14 చెరువులు, వరంగల్ పరిధిలో 6 చెరువుల వద్ద గణేశ్ ప్రతిమల నిమజ్జనం జరగనుంది. బల్దియా అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్ని విభాగాల సమన్వయం, ఈఈ టి.రవికుమార్ హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో , ఈఈ సంతోష్‌బాబు, వరంగల్‌లో రోడ్ల మరమ్మతులు, చెరువుల వద్ద ఏర్పాట్లు తదితరులు పనులను పర్యవేక్షించనున్నారు. ఈఈ మాధవి నిమజ్జన చెరువుల వద్ద లైటింగ్ ఏర్పాటుపై దృష్టి సారించనున్నారు. హనుమకొండ, కాజీపేట సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, వరంగల్‌లో ఎంహెచ్‌ఓ రాజేశ్‌కు పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. అగ్ని ప్రమాదాలు, తదితర పనులకు బల్దియా డీఎఫ్‌ఓ శంకర్ లింగం, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ రాజేశ్వర్‌ను నియమించారు.

నిమజ్జన చెరువులు	ఇన్‌చార్జ్ అధికారులు
సిద్ధేశ్వర గుండం, కడిపికొండ	డీసీ, రవీందర్
బంధం ట్యాంక్, సోమిడి చెరువు	టీపీఓ, ఇర్షాద్
ఎల్లాపూర్, హసన్‌పర్తి	హెచ్‌ఓ, రమేష్
భీమారం, గోపాల్‌పూర్	ఏసీపీ, ప్రశాంత్
రాంపేట, మడికొండ	హెచ్‌ఓ, లక్ష్మారెడ్డి
వంగపహాడ్	టీపీఓ, రజిత
గుండ్ల సింగారం, సింగారం	సీపీ, రవీందర్ రాడేకర్
కోటచెరువు, చిన్నవడ్డేపల్లి	డీసీ, సమ్మయ్య
కట్టమల్లన్న, అగర్తలా	టీఓ, రామకృష్ణ
బెస్తం ట్యాంక్, ఉర్సు రంగసముద్రం	ఏసీపీ, శ్రీనివాస్ రెడ్డి
మామునూరు, తిమ్మాపూర్	ఏసీపీ ఖలీలొద్దీన్

న్యూస్‌రీల్

వేయిస్తంభాల ఆలయంలో సింహగణపతిగా అలంకరణ



హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో బుధవారం మూల మహా గణపతిని శ్రీసింహగణపతిగా అలంకరించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు మూల గణపతికి సింధువర్ణాభిషేకం జరిపి సింహగణపతిగా అలంకరించి, పల్లకిసేవ నిర్వహించారు. సాయంత్రం నృత్యగురువు పిండి సుభాషిణి శిష్య బృంద కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఈఓ అనిల్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

6న జరగాల్సిన ఎల్‌ఎల్‌బీ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 6న జరగాల్సిన ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు మూడో పేపర్, ఎల్‌ఎల్‌బీ ఐదేళ్ల లా కోర్సు ఆరో సెమిస్టర్ మూడో పేపర్ పరీక్షలు గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసిం ఇక్బాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్షలు ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. మిగతా పరీక్షల్లో ఎలాంటి మార్పులు లేవని, విద్యార్థులు గమనించాలని సూచించారు. వివరాలకు కేయూ వెబ్‌సైట్ 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్'లో చూడవచ్చని తెలిపారు.

ముగిసిన సీఓఈ ప్రవేశ పరీక్ష

న్యూశాయంపేట: తెలంగాణ మైనార్టీ గురుకులాల ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)లో ప్రవేశానికి వరంగల్ నగరంలోని రంగశాయిపేట శివారు జక్కలొద్ది, కేయూ క్రాస్‌రోడ్డులోని గురుకులాల్లోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష బుధవారం ముగిసినట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ జే.సతీష్ తెలిపారు. ఐఐటీ కోసం 164 మంది దరఖాస్తు చేసుకోగా, ఏడుగురు గైర్హాజరయ్యారని, 157 మంది పరీక్షలో ఉత్తీర్ణత సాధించారన్నారు. నీట్ కోసం 96 మంది దరఖాస్తు చేసుకొని పరీక్షకు హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్షకు హాజరైన వారిలో 89 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

టీజీ ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా బోనాల కిషన్



హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా బోనాల కిషన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన బోనాల కిషన్‌ను ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమిస్తూ ట్రాన్స్‌కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరణ అనంతరం ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

కేయూ విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, విభాగాధిపతిగా రిజిస్ట్రార్ వి.రామచంద్రం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆకళాశాలలో రెగ్యులర్ ఆచార్యులు ఎవరూ లేక ఇన్నాళ్లు హిస్టరీ విభాగం ప్రొఫెసర్ ఆచార్య టి.మనోహర్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

నిబంధనలు పాటించాలి

విద్యారణ్యపురి: అడ్మిషన్ల ప్రక్రియలో జూనియర్ కళాశాలలు ఇంటర్ బోర్డు నియమ నిబంధనలను పాటించాలని వరంగల్ డీఐఈఓ డాక్టర్ శ్రీధర్‌సుమన్ కోరారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ కళాశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. దరఖాస్తులు, టీసీలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు ఇంటర్ అడ్మిషన్లకు టీసీ తప్పనిసరి అన్నారు. నిబంధనలను పాటించని కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, అభ్యసన తరగతులు నిర్వహించాలన్నారు. కళాశాలల్లో రోజువారీ హాజరు, అంతర్గత పరీక్షలు, ప్రమాణాల పెంపుపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఇంటర్ అడ్మిషన్ల లాగిన్‌లో విద్యార్థుల వివరాలు, ఫొటో, సంతకం, యూడైస్ పెన్ నంబర్ తదితర వివరాలను నవీకరించాలని పేర్కొన్నారు.

ఓరుగల్లు కేంద్రంగా
రాజకీయం!

అన్ని పార్టీలకు ఉమ్మడి జిల్లా అంశాలే ప్రధానాస్త్రాలు
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టు
- బీఆర్‌ఎస్ నేతల్లో కల్వకుంట్ల కవిత వ్యాఖ్యల కలకలం
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి మధ్య మరింత అగాధం

సాక్షి ప్రతినిధి, వరంగల్: స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలోనే జరగనున్నాయన్న ప్రచారం నేపథ్యంలో.. ఓరుగల్లు రాజకీయాలు వేడెక్కాయి. సెప్టెంబర్ నెలాఖరులో ఎన్నికలు ఖాయమన్న సంకేతాలు బలంగా ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఓ వైపు నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేస్తూనే.. మరోవైపు పరస్పర విమర్శలకు తెర తీశాయి. రాష్ట్రస్థాయిలోనూ ఓరుగల్లు అంశాలే ప్రధాన పార్టీలు అస్త్రాలుగా మార్చుకుని దూకుడు పెంచాయి. తారస్థాయికి చేరిన ప్రధాన రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలు ఓరుగల్లును కుదిపేస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు ముందు.. తర్వాత బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరం ప్రాజెక్టు అంశాలు తాజా పరిణామాలు కాగా.. బీఆర్‌ఎస్ నుంచి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను సస్పెండ్ చేయడం కలకలంగా మారింది. ఆమె వరంగల్ నేతలపై చేసిన వ్యాఖ్యలు కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

అన్ని పార్టీలకు అస్త్రంగా కాళేశ్వరం ప్రాజెక్టు..
ఉమ్మడి వరంగల్ గోదావరిపై మేడిగడ్డ సమీపంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు అన్ని పార్టీలకు అస్త్రంగా మారింది. 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ రిజర్వాయర్‌కు సంబంధించిన మూడు పిల్లర్లు కుంగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ విచారణకు ఆదేశించడం.. ఎన్డీఎస్‌ఏ నివేదిక, ఎక్స్‌పర్ట్స్ కమిటీ రిపోర్ట్, పీసీ ఘోష్ నివేదికను ఆదివారం అసెంబ్లీలో ప్రవేశపెట్టే వరకు అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో.. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలన్నీ స్థానికంగా ఆ పరిణామాలపైనే మాట్లాడుతున్నాయి. ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి నిబంధనను ఎత్తివేస్తూ బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచేందుకు పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును అసెంబ్లీలో పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం, మండల కేంద్రాల్లో సంబురాలు చేయగా.. బీఆర్‌ఎస్ పార్టీ పీసీ ఘోష్ కమిటీ నివేదిక, ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నాలు, నిరసనలు చేపట్టింది.

ఓరుగల్లు బీఆర్‌ఎస్‌లో కవిత కలకలం..

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎపిసోడ్ ఓరుగల్లు బీఆర్‌ఎస్‌లో కలకలంగా మారింది. బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో కవిత ఓరుగల్లు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. మున్సిపల్ కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికలకు మంత్రులతో పాటు ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆమె.. ఉమ్మడి జిల్లా నేతలతో తనకంటూ ఓ గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. కొంతకాలంగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కవితపై బీఆర్‌ఎస్ అధిష్టానం మంగళవారం సస్పెన్షన్ వేటు వేసింది. జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పేరు మీద సస్పెన్షన్ లేఖ వెలువడగా.. ఆమె కూడా పార్టీ, ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈసందర్భంగా మాట్లాడిన కవిత.. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పేర్లు ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరించిన ఓ కాంట్రాక్టు సంస్థతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి బ్లూపిన్ కంపెనీ పేరిట రూ.750 కోట్లతో వెంచర్ చేస్తున్నారని.. ఈవిషయం తనకు పల్లా రాజేశ్వర్ రెడ్డి చెప్పారని కవిత ప్రకటించారు. దీంతో గత ఎన్నికల్లో జనగామ టికెట్ ఆశించిన శ్రీనివాస్‌రెడ్డి.. చివరి నిమిషంలో టికెట్ దక్కించుకున్న పల్లా రాజేశ్వర్ రెడ్డి మధ్య ఇప్పటికే ఉప్పు, నిప్పులా ఉండగా.. కవిత వ్యాఖ్యలు ఆ బీఆర్‌ఎస్ నేతల మధ్య మరింత గ్యాప్‌నకు దోహదం కానున్నాయి.

6న సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 6న నగరంలోని జేఎన్‌ఎస్‌లో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. 6న ఉదయం 8గంటలకు ఐడెంటిటీ కార్డు, ప్రస్తుత సర్వీస్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, యోగా, ఖోఖో క్రీడాంశాల్లో, పురుషులకు క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు 9, 10వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు డీఎస్‌ఏ అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ 94410 86556 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

7న ఉద్యోగులకు జిల్లాస్థాయి పోటీలు
న్యూశాయంపేట: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ (ఏఐసీఎస్)లో పాల్గొనేందుకు ఈనెల 7న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు వరంగల్ జిల్లా యువజన, క్రీడల అధికారి టీవీఎల్.సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ఓసిటీ స్టేడియంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల ఉద్యోగులు ఐడీ కార్డు, ఆధార్ కార్డు, క్రీడాసామగ్రి వెంట తెచ్చుకోవాలని సూచించారు. 19 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు ఓసిటీలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పెరిగిన భూగర్భ జలాలు

- ఇటీవల కురిసిన భారీ వర్షాలు
- తగ్గిన భూగర్భ జల వినియోగం



మత్తడి పోస్తున్న కటాక్షపూర్ చెరువు (ఫైల్)

హన్మకొండ: గ్రేటర్ వరంగల్ నగరంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జల వినియోగం తగ్గింది. చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరింది. దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. వరంగల్ జిల్లాలో సగటు భూగర్భ జలమట్టం 3.14 మీటర్ల లోతు, హనుమకొండ జిల్లాలో 4.70 మీటర్ల లోతులో ఉన్నాయి. ఈ వర్షాకాలంలో వరంగల్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లాలో సాధారణ వర్షం కురిసింది. ఈ మేరకు భూగర్భ జలాల పెరుగుదలలో స్వల్ప తేడా ఏర్పడింది. వరంగల్ జిల్లాలో సగటు భూగర్భ జలమట్టంతో పోలిస్తే హనుమకొండ జిల్లాలో 1.6 మీటర్ల లోతుకు పడిపోయింది. ఇప్పటి వరకు వరంగల్ జిల్లా సగటు సాధారణ వర్షపాతం 698.4 మిల్లీమీటర్లు కాగా.. 868.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్ధన్నపేట, గీసుకొండలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఖిలా వరంగల్, వరంగల్‌లో సాధారణ వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లాలో సగటు సాధారణ వర్షపాతం 657.5 మిల్లీమీటర్లు కాగా.. 660 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. హసన్‌పర్తి, హనుమకొండ, కాజీపేట, ఐనవోలు, మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంతో హనుమకొండ జిల్లాలో భూగర్భ జలాల పెరుగుదల స్వల్పంగానే ఉంది.

బయోగ్యాస్ ప్లాంట్లను నిర్మించండి

- ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్‌ఐయూఏ సెక్రటరీ నితేష్ అనిరుత



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలో బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణాలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్‌ఐయూఏ) సెక్రటరీ నితేష్ అనిరుత సూచించారు. బుధవారం ఢిల్లీనుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరంగల్‌నుంచి బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నితేష్ అనిరుత మాట్లాడుతూ నగరంలో కంప్రెషెడ్ బయోగ్యాస్ ప్లాంట్ (సీబీజీ) ఏర్పాటు కోసం డీపీఆర్ సిద్ధం చేయాలన్నారు. దీనిపై కమిషనర్ బాజ్‌పాయ్ స్పందిస్తూ నగరంలో రెండు బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మరిన్ని ప్లాంట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని తెలిపారు. వీసీలో సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ నిర్వహణ పక్కాగా జరగాలి
నగరంలో శానిటేషన్ నిర్వహణ పక్కాగా జరగాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ప్రజారోగ్యం, శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కార్మికులు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, వాహనాలు, రోజూ ఇంటింటా చెత్త సేకరణ, తరలింపు తదితర అంశాలపై సీరియస్‌గా దృష్టి సారించాలన్నారు.

కేసీఆర్ కుటుంబాన్ని రాష్ట్రంనుంచి బహిష్కరించాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ సెంటిమెంట్‌తో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకుతిన్న కేసీఆర్ కుటుంబాన్ని, వారి బినామీలను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన 1,200 మంది అమరుల ఆత్మలు కవిత రూపంలో నిజాలు మాట్లాడిస్తున్నాయన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న సొమ్ముల పంపకంలో వచ్చిన పంచాయితీలను కవిత బయట పెడుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన అధికారుల ఇళ్లలో సోదాలు చేస్తే వందల కోట్లు దొరికింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కవిత చేసిన ఘనకార్యానికి వరంగల్ బీఆర్‌ఎస్ నాయకులు ధర్నాలు, నిరసనలు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్ జక్కుల రవీందర్, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, బంక సరళ, బంక సంపత్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వరంగల్ కలెక్టర్ సత్యశారద హెచ్చరించారు. కలెక్టరేట్‌లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సమావేశాన్ని కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం సరైన పత్రాలు సమర్పించిన ఆస్పత్రులకు అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, పాలి క్లినికల్ ల్యాబ్స్, ఫిజియోథెరపీ సెంటర్లు, కంటి పరీక్ష కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సాంబశివరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ శంకర్‌లింగం, శ్రీధర్‌రెడ్డి, లచ్చయ్య, విల్సన్, ఐఎంఏ సభ్యులు డాక్టర్ అజీత్‌మహ్మద్, డాక్టర్ నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల్ని తనిఖీ చేయాలి
ఎంపీడీఓలు పాఠశాలలను తనిఖీ చేసి నివేదికల ఆధారంగా విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు.

5న జీపీఓలకు నియామక పత్రాలు
న్యూశాయంపేట: గ్రామ పరిపాలన అధికారులుగా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించనున్నట్లు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ సీసీఎల్‌ఏ నుంచి బుధవారం కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జీపీఓ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఈనెల 5న హైటెక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత రవాణా సదుపాయం కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ జిల్లాలో 165 మంది గ్రామపరిపాలన అధికారులుగా ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

క్రీడల అభివృద్ధికి కృషి..

- పీడీలు సమన్వయంతో పనిచేయాలి
- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో క్రీడల అభివృద్ధికి అవసరమైన వనరులు సమకూరుస్తామని, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేలా ఫిజికల్ డైరెక్టర్లు (పీడీ) సమన్వయంతో పనిచేయాలని వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని పరిపాలన భవనంలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన స్పోర్ట్స్ బోర్డు సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల క్రీడాప్రతిభను ఫిజికల్ డైరెక్టర్లు గుర్తించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడారంగంలో యూనివర్సిటీ ప్రతిష్ట పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్ట్రార్ వి. రామచంద్రం మాట్లాడుతూ క్రీడలను క్రమశిక్షణతో నిర్వహించాలన్నారు. స్పోర్ట్స్ బోర్డు చైర్మన్ టి. మనోహర్ మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నారని, వారికి క్రీడలపై ఆసక్తి పెరిగేలా కృషిచేయాలన్నారు. అనంతరం పలువురు ఫిజికల్ డైరెక్టర్లు మాట్లాడుతూ క్రీడలకోసం మౌలిక వసతులు పెంచాలన్నారు. కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య, ఫైనాన్స్ ఆఫీసర్ హబీబుద్దీన్, జె. సోమన్న, వెంకన్న, ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి, వర్సిటీ పరిధిలోని ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం కేయూ ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్ షెడ్యూల్ వెల్లడించారు. కబడ్డీ, అథ్లెటిక్స్, క్రికెట్ తదితర క్రీడాపోటీలకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. కాగా, ఈనెల 11 నుంచి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం కానుంది.

వడివడిగా అడుగులు..

వస్త్ర పరిశ్రమలో కైటెక్స్, యంగ్‌వన్ కంపెనీల ట్రయల్ రన్

- రెండు నెలల్లో మార్కెట్‌లోకి రానున్న ఉత్పత్తులు
- 35వేల మందికిపైగా ఉద్యోగావకాశాలు



కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తికి సిద్ధమవుతున్న కైటెక్స్ కంపెనీ

సాక్షి, వరంగల్: గీసుకొండ-సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మరో రెండు ప్రధాన కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నాయి. కేరళ కేంద్రంగా ఉన్న చిన్నపిల్లల దుస్తులు తయారుచేసే కైటెక్స్ కంపెనీతోపాటు దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కంపెనీ కూడా కొన్ని షెడ్లు నిర్మించి తమ ఉత్పత్తుల కోసం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నాయి. మరో రెండు నుంచి మూడు నెలల్లో తమ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కంపెనీల ఉత్పత్తులు ప్రారంభించేందుకు ఆలోచన చేస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టెక్స్‌టైల్ పార్కులో 22 కంపెనీలు ఎంఓయూ కుదుర్చుకుంటే రెండు కంపెనీలు ఉత్పత్తులు ప్రారంభించాయి. ఇప్పుడు మరో రెండు ప్రధాన కంపెనీలు ఆ దిశగా ముందుకెళ్తున్నాయి. వీటి ద్వారా 35వేలకుపైగా ఉద్యోగాలు రానున్నాయి.

కైటెక్స్ రూ.1200 కోట్ల పెట్టుబడి..

కైటెక్స్ కంపెనీ యార్న్, ఫ్యాబ్రిక్, ఇన్నర్, ఔటర్ వియర్, సాక్స్‌లు, అసెసరీస్, ప్యాకింగ్ మెటీరియల్స్ తయారీ చేసేందుకు సకల హంగులతో నిర్మాణాలు చేస్తోంది. ఇప్పటి వరకు ఒక్కొక్కటి 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు పెద్ద షెడ్లను నిర్మించారు. రూ.1200 కోట్ల పెట్టుబడులతో 191 ఎకరాల్లో ఈ కంపెనీ కార్యకలాపాలు మొదలుకానున్నాయి. ప్రస్తుతం కంపెనీలో ముడి పత్తి నుంచి జిన్నింగ్, ప్రెస్సింగ్, స్పిన్నింగ్ ప్రాసెస్ ప్రారంభమై ట్రయల్ రన్ నడుస్తోంది. మరో రెండు నెలల్లో పూర్తి స్థాయిలో కంపెనీ ప్రారంభమయ్యే అవకాశం ఉందంటున్నారు. ఇందులో 25,000 ఉద్యోగాలను భర్తీ చేయడానికి కంపెనీ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది.

చకచకా వసతుల కల్పన..

1350 ఎకరాల్లోని మెగా టెక్స్‌టైల్ పార్కులో గత బీఆర్ఎస్ సర్కారు రూ.500 కోట్లు ఖర్చు చేసింది. అందులో రూ. 160 కోట్లు భూసేకరణ కోసం రైతులకు పరిహారం చెల్లించింది. పార్కులో వరద కాల్వ నిర్మాణం కోసం రూ.159తో పనులు జరుగుతున్నాయి. పీఎం మిత్రలో రూ.200 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినా ఇంత వరకు మంజూరు కాలేదు. విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, రెండు 132 కేవీ లైన్ల కోసం రూ.209 కోట్లు కేటాయించారు. చలివాగు నుంచి నీటిని సరఫరా కోసం సుమారు 45 కి.మీ పొడవులో పైపులైన్ బిగించారు. ఒక ఎంఎల్‌డీ, ఐదు ఎంఎల్‌డీ (ఒక ఎంఎల్‌డీ అంటే పది లక్షల లీటర్ల నీరు) అందించనున్నారు. భూ నిర్వాసితులకు 823 ప్లాట్లు కేటాయించి రాజీవ్ టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో వాటర్ సప్లయ్, సీవరేజ్ ప్లాంట్, వీధి దీపాలు, ఎల్‌టీ లైన్, మురుగు వాటర్ డ్రెయిన్, ట్రీట్‌మెంట్ ప్లాంటు, వాటర్ ట్యాంకు కోసం రూ.14 కోట్ల నిధులతో పనులకు టెండర్లు పూర్తయ్యాయి. 50 గజాల స్థలం వచ్చిన వారికి 70 గజాలు చేస్తూ 187 మందికి ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. రూ.5.50 కోట్లతో స్కూల్, పీహెచ్‌సీ, జీపీ భవనం, వెటర్నరీ ఆస్పత్రి పనులు జరుగనున్నాయి. మౌలిక వసతుల కోసం రూ.14 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయి. 2024 నవంబర్ 19న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రాజీవ్ టౌన్‌షిప్ పనులకు శంకుస్థాపన చేశారు.

యంగ్‌వన్ రూ.980 కోట్ల పెట్టుబడి..

దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ (ఎవర్ టాప్ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్) కంపెనీ 297.59 ఎకరాల్లో రూ.980 కోట్ల పెట్టుబడితో క్రీడా దుస్తులు, బూట్లు, ఇతర దుస్తులు తయారుచేసేందుకు వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే నిర్మించిన ఐదు షెడ్లలో ఉత్పత్తుల కోసం ట్రయల్ రన్ నడుస్తోంది. ఈ కంపెనీ ద్వారా 11,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఇది కూడా సాధ్యమైనంత తొందర్లోనే ప్రారంభం కానుంది. ఇప్పటికే యూపీలోని కాన్పూర్ కేంద్రంగా ఉన్న గణేశ్ ఎకోటెక్ కంపెనీ 50 ఎకరాల్లో రూ.500 కోట్ల పెట్టుబడితో రెండు యూనిట్లు స్థాపించింది. వాడిన ప్లాస్టిక్ బాటిళ్ల నుంచి యార్న్, బాటిల్స్‌ను తయారు చేస్తోంది. ఇందులో సుమారు 450 మంది పనిచేస్తున్నారు.

ఎస్సార్‌లో అంతర్జాతీయ విద్యామేళా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ దీపక్‌గార్గ్

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో అంతర్జాతీయ విద్యా మేళా-2025 నిర్వహించారు. ఎస్సార్ ఐ ఎక్స్ ఆడిటోరియంలో బుధవారం ఈకార్యక్రమం జరిగింది. యూనివర్సిటీ హబ్, అబాకస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అడ్వయిజర్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సార్ యూనివర్సిటీ వీసీ దీపక్‌గార్గ్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈమేళాలో అమెరికా, యూకే, యూరప్, కెనడా, న్యూజిలాండ్ దేశాలకు చెందిన సుమారు 30 యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు. 2,500 మంది విద్యార్థులు హాజరై ఉన్నత విద్య అవకాశాలు, స్కాలర్‌షిప్స్, గ్లోబల్ కెరీర్ మార్గాలు, అడ్మిషన్, వీసా ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్, సిటీ యూనివర్సిటీ ఆఫ్ సియాటిల్, వెబ్‌స్టర్ యూనివర్సిటీ, నయాగరా యూనివర్సిటీ, జావియర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ వైకాటో, యూనివర్సిటీ కాటోలికా డెల్ సాక్రో కుటర్, డబ్ల్యూసీఐ, గానస్ యూనివర్సిటీ, రేవన్స్‌బోర్న్ యూనివర్సిటీ లండన్, తదితర యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులతో పాటు ఇంటర్నేషనల్ ఎఫైర్స్ అండ్ కార్పొరేట్ ఔట్‌రీచ్ డైరెక్టర్ ప్రతినిధి ప్రీతా చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

7న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-15 చెస్ పోటీలు



అక్షిత్ చౌహాన్

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమైక్య ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-15 చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 01, 2010, ఆ తర్వాత జన్మించిన వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఇందులో గెలుపొందిన నలుగురు బాలురు, నలుగురు బాలికలు అక్టోబర్‌లో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట చెస్ బోర్డు తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అక్షిత్‌చౌహాన్‌కు అంతర్జాతీయ రేటింగ్

హనుమకొండ రాంనగర్‌కు చెందిన ఆరేళ్ల లావుడ్య అక్షిత్ చౌహాన్ అంతర్జాతీయ చదరంగం రేటింగ్ సాధించాడు. గత నెలలో నాగ్‌పూర్‌లో జరిగిన 1,700 అంతర్జాతీయ ఫిడే రేటింగ్‌లో పాల్గొని 1,439 రేటింగ్ సాధించినట్లు జిల్లా చదరంగ సమైక్య బాధ్యుడు పి. కన్నా తెలిపారు. అక్షిత్ చౌహాన్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మొదటి తరగతి చదువుతున్నాడు. దీనిపై బాలుడి తల్లిదండ్రులు శశికాంత్, అఖిలానాయక్ హర్షం వ్యక్తం చేశారు.

సంపూర్ణ చంద్రగ్రహణం ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్ : శతభిషం, పూర్వాభాద్ర నక్షత్రంలో కుంభరాశిలో రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతున్నందున కుంభ, మేష, వృషభ, మిధునరాశి వారు ఈ గ్రహణం చూడరాదని, గ్రహణ ప్రభావం ఉన్నందున సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించుకోవాలని రాష్ట్ర అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, వరంగల్ శ్రీరాజరాజేశ్వరీదేవి దేవాలయం అర్చకులు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జపం చేసి తీర్థం తీసుకోవడం వల్ల ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 4గంటల లోపు, వృద్ధులు, పిల్లలు రాత్రి 8లోపు భోజనాలు ముగించుకోవాలని తెలిపారు. శ్రీరాజరాజేశ్వరీ దేవాలయంలో భక్తులు దోషనివారణ కోసం పూజలు నిర్వహించుకోవచ్చునని ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా, శతభిషం, పూర్వాభాద్ర నక్షత్రంలో కుంభరాశిలో రాహుగ్రస్త సంపూర్ణచంద్రగ్రహణం ఏర్పడుతున్నందున కుంభ, మేష, వృషభ, మిధునరాశి వారు ఈ గ్రహణం చూడరాదని రాష్ట్ర అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

- వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలో ఘటన



సాకేత్ (ఫైల్)

మామునూరు: లారీ ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన పెద్దూరి భవాని రెండో కుమారుడు సాకేత్(23) డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పని నిమిత్తం బైక్‌పై వరంగల్ రంగశాయిపేటకు వచ్చాడు. పని ముగిసిన అనంతరం బుధవారం తెల్లవారుజామున ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఆర్టీఏ జంక్షన్ సమీపానికి చేరగానే ఖమ్మం నుంచి ఉర్సు గుట్టవైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో అదే లారీ కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే మామునూరు ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు.

మార్కెట్‌కు 3 రోజులు సెలవు

వరంగల్ చౌరస్తా : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు సెలవులు ఉంటాయని సెలక్షన్ గ్రేడ్ ఇన్‌చార్జ్ కార్యదర్శి జీ.రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న మిలాద్ ఉన్ నబీ, శనివారం వారాంతం, 7న ఆదివారం కావున సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈనెల 8న తిరిగి మార్కెట్‌లో క్రయ విక్రయాలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు. రైతులు సెలవుల దృష్ట్యా మార్కెట్‌కు సరుకులను తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్లపై | రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్

హన్మకొండ: బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. బుధవారం హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు గల్లీలో మద్దతు ఇస్తూ ఢిల్లీలో అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ప్రధాన పార్టీలు కుట్రలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం, అగ్రకులాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించి 60 శాతంగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించకుండా మోసం చేస్తున్నాయన్నారు. నెల రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలు జరిగినా ఇండియా కూటమి ఎంపీలు, బీజేపీ ఎంపీలు బీసీ రిజర్వేషన్లపై నోరు విప్పలేదని మండిపడ్డారు. అన్ని రాజకీయ పార్టీలు సిండికేట్ అయ్యాయని, ఈ కుట్రలను బీసీలు అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రపతి ఆమోదానికి బిల్లు పంపి 5 నెలలవుతున్నా మోక్షం లేదన్నారు. అఖిలపక్షాన గవర్నర్‌ను కలిస్తే బీజేపీ కలిసి రాలేదని, పైగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో పెట్టేది లేదని చెప్పుతున్నారని మండిపడ్డారు. అఖిలపక్షం కలిసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమయం ఇవ్వడం లేదన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, నాయకులు సంగని మల్లీశ్వర్, వరంగల్ శ్రీనివాస్, దాడి మల్లయ్య యాదవ్, అరుంధతి, తమ్మల శోభారాణి, పద్మజ, బీమగాని యాదగిరి గౌడ్, పాండవుల శ్రీనివాస్, కొట్టే మహేందర్ పాల్గొన్నారు.

మల్లన్నగండి కుడి కాల్వ నిర్మాణం అద్భుతం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఎమ్మెల్యే కడియం
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో ఎంపీ కావ్య తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: గండి రామారం (మల్లన్నగండి) కుడి కాల్వ నిర్మాణం అద్భుతమని, గుట్టల నుంచి సైతం కాల్వలు తీయొచ్చు.. గోదావరి జలాలు పారించొచ్చు.. పంటపొలాలు పండించొచ్చని నిరూపితమైందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఎమ్మెల్యే కడియం ప్రత్యేక చొరవతో రూ.29 కోట్ల వ్యయంతో మండలంలోని మీదికొండ శివారులో 11 గ్రామాల్లో 5,600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన మల్లన్నగండి కుడి కాల్వను ఎంపీ డాక్టర్ కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ వెంకన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎత్తైన, కరువు ప్రాంతాలు జనగామ, చేర్యాల, వర్ధన్నపేట, పాలకుర్తి తదితర ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో 2003లో దేవాదుల మొదటి దశ పనులు ప్రారంభించామన్నారు. నాడు దేవాదుల పేరుతో కడియం డ్రామా ఆడుతున్నారని, దేవాదుల దేవతలకే సాధ్యం కాదని పలువురు విమర్శలు చేశారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం కాల్వలో పారుతున్న నీరు చూస్తే వారికి జ్ఞానోదయం అవుతుందన్నారు.

రూ.1,015 కోట్ల ప్యాకేజీతో పలు పనులకు ఆమోదం

దేవాదుల మూడో దశ 6వ ప్యాకేజీ ద్వారా నాలుగు నియోజకవర్గాల్లో 78వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే సవరించిన అంచనాలతో రూ.1,015 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే కడియం చెప్పారు. ఏడాది లోపు పనులు పూర్తి చేయిస్తానన్నారు. అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధికి ఏడాదిన్నరలోనే రూ.వెయ్యి కోట్ల నిధులు తీసుకొచ్చానన్నారు. రాజకీయ జన్మనిచ్చిన నియోజకవర్గ అభివృద్ధికి తన చివరి శ్వాస వరకు కృషి చేస్తానన్నారు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన కడియం..

రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవజ్ఞులైన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారని, ఎడారి వంటి వాతావరణంలో జీవిస్తున్న రైతుల సంక్షేమం కోసం భారీ ఎత్తున నీటిని విడుదల చేయడం చారిత్రక ఘట్టమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, కరుణాకర్, చిల్పూరు దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, నాయకులు రాపోలు మధుసూదన్‌రెడ్డి, నాగరబోయిన యాదగిరి, వెంకటేశ్వర్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, కొలిపాక సతీశ్, ఈఈ వినయ్, డీఈ సంపత్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



గోదావరి జలాల్లో పూలు చల్లి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య

పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలి

- వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు ఎం.యాకాద్రి



మచ్చాపూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న యాకాద్రి

హన్మకొండ: పరిశోధన ఫలితాలు రైతులకు చేరాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎం.యాకాద్రి అన్నారు. వరంగల్ జిల్లాలోని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పంటపొలాల్లో నిర్వహిస్తున్న వివిధ పరిశోధనలు, నూతన వంగడాల పరీక్ష క్షేత్రాలు, గీసుకొండ మండలం మచ్చాపూర్‌లో అధిక సాంద్రత విధానంలో సాగు చేస్తున్న పత్తి పంట, నర్సంపేట మండలంలో గురిజాలలో నేరుగా విత్తే పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటను వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డితో కలిసి బుధవారం యాకాద్రి పరిశీలించారు. జిల్లాలో రైతుల కోసం నిర్వహిస్తున్న వివిధ విస్తరణ కార్యక్రమాల పురోగతి గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.విజయభాస్కర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.వీరన్న, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ విశ్వతేజ, ఏఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న వైస్‌చాన్స్‌లర్లు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క, సారలమ్మను బుధవారం ఐదు రాష్ట్రాలకు చెందిన వివిధ యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు (వీసీ) దర్శించుకున్నారు. హిమాచల్ ప్రదేశ్, (సిమ్లా) త్రిపుర, పాండిచ్చేరి, కర్ణాటక, (బెంగుళూర్) గుజరాత్ (రాజ్‌కోట్) రాష్ట్రాలకు చెందిన వీసీలు సంజయ్‌శర్మ, మిలాని రాణి, వెంకటరావు, విష్ణుకంటి, నవీన్ చంద్ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద పూజలు చేశారు. దేవాదాయశాఖ అధికారులు, పూజారులు డోలివాయిద్యాలతో వీసీలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైస్ చాన్స్‌లర్లను పూజారులు అమ్మవారి శేషవస్త్రాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్లు మధు, బాలకృష్ణ, పూజారులు పాల్గొన్నారు.

అర్ధశతాబ్దపు ఆనందోత్సవం..

నేడు ఫార్మసీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

- తరలిరానున్న పూర్వ, ప్రస్తుత విద్యార్థులు
- ఈనెల 12,13 తేదీల్లో అమెరికాలో కూడా..



విద్యుత్ వెలుగుల్లో కేయూ ఫార్మసీ కాలేజీ భవనం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాల ఏర్పాటై 50 వసంతాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో నేడు (ఈనెల 4న) గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలు కేయూలో ప్రారంభమై అమెరికా, హైదరాబాద్‌లో కూడా జరగనున్నాయి.

ఉస్మానియా నుంచి షిఫ్ట్..

బీ ఫార్మసీ కోర్సు తొలుత హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో 1974లో ఏర్పాటుచేశారు. ఆ తర్వాత 1975లోనే వరంగల్‌కు షిఫ్ట్ అయ్యింది (కేయూకు). తొలుత ఆర్ఈసీ, కేఎంసీలో కూడా తరగతులు జరిగేవి. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీలో బీఫార్మసీ కోర్సుతో ప్రారంభమైన ఈ ఫార్మసీ కాలేజీ అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది ఎం.ఫార్మసీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ కూడా కొనసాగుతున్నాయి.ఈ ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో పరిశోధనలు కూడా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 2024లో ఈ ఫార్మసీ కాలేజీ ఎన్ఆర్ఐఎఫ్ ర్యాంకింగ్‌లో 88వ స్థానంలో నిలిచింది. పలువురి ప్రొఫెసర్లు వివిధ పరిశోధనల్లో 12 పేటెంట్లు కలిగి ఉన్నారు. ఇప్పటివరకు 350మంది పైగా పరిశోధకులు పీహెచ్‌డీ పూర్తిచేశారు.

దేశ, విదేశాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు

కాకతీయ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో (కాలేజీ) చదివిన, పరిశోధనలు చేసిన ఎంతోమంది విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ముఖ్యంగా అమెరికాలో ఎక్కువ మంది ఫార్మసీ రంగంలో సైంటిస్టులు, ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. అలాగే, కొందరు ఔషధ పరిశ్రమలు స్థాపించారు. యూకే, ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, న్యూజిలాండ్, ఇథియోపియా, సౌతాఫ్రికా అరబ్ దేశాల్లోనూ ఉన్నతస్థానంలో స్థిరపడ్డారు.

12,13వ తేదీల్లో అమెరికాలోని అట్లాంటాలో..

అమెరికాలో స్థిరపడిన కేయూ ఫార్మసీ కాలేజీ పూర్వ విద్యార్థులు ఈనెల 12,13తేదీల్లో అక్కడే అట్లాంటాలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించకోబోతున్నారు. అక్కడ నుంచి కేయూకు రాలేనివారు ఈ ఉత్సవాలను నిర్వహించుకున్నారు.

అక్టోబర్ 11,12 తేదీల్లో హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లోని కేయూ ఫార్మసీ కాలేజీ పూర్వ విద్యార్థు అక్టోబర్ 11,12 తేదీల్లో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించుకోబోతున్నారు. మళ్లీ కేయూలో డిసెంబర్ 27, 28తేదీల్లో ముగింపు సమావేశాలు నిర్వహించనున్నారు.

తరలిరానున్న పూర్వవిద్యార్థులు

ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సుమారు 300 మంది పూర్వవిద్యార్థులు తరలి రానున్నారు. ప్రస్తుత విద్యార్థులు 250మందికిపైగా పాల్గొనబోతున్నారని గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల కన్వీనర్, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 10గంటలకు సెనేట్‌హాల్‌లో ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీసీ కె. ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ వి. రామచంద్రం, రిటైర్డ్ ప్రొఫెసర్లు డి. రాంబహు, వి. మల్లారెడ్డి, పి. అమరేశ్వర్, ఏవిఎన్ అప్పారావు, హైదరాబాద్‌లోని యూరో మెడికేర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జె. రాజమౌళి, హైదరాబాద్ ఎస్ఎన్‌వీపీఎంవీ సీఎండీ బి. ప్రభాశంకర్ పాల్గొననున్నారు. ఉత్సవాలకు చైర్మన్‌గా ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ జె. కృష్ణవేణి, కన్వీనర్‌గా గాదె సమ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వై. నర్సింహారెడ్డి వ్యవహరిస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ IV
వరంగల్
గురువారం ॥ 4-9-2025



జాతీయ పోషకాహార వారోత్సవాలు

ఫుడ్ ఫర్ టీన్స్



పిల్లల విషయంలో పెద్దవారికి ఒక రకమైన ఆందోళన ఉంటే... కాస్త పెద్ద పిల్లల విషయంలో ఇంకో రకమైన ఇబ్బందులు ఉంటాయి. అంటే పదేళ్లు దాటి టీనేజ్‌లో ఉండే పిల్లల్లో మరికొన్ని సమస్యలు చూస్తుంటాం. ఈ రోజుల్లో అయితే టీనేజ్ పిల్లల్లో ఆందోళన, మానసిక ఒత్తిడి, అధికంగా కోపం, డిప్రెషన్ వంటివి తరచూ వింటున్నాం. వారు తినే ఆహారపు ప్రభావం మానసిక, శారీరక స్థితిపైన చూపుతుంది. అందుకని, టీనేజ్ పిల్లలున్న ఇంట్లో పోషకాహారం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలి.

13–19 ఏళ్ల మధ్య ఫిజికల్, మెంటల్ గ్రోత్ వేగంగా మార్పు చెందుతుంటుంది. ఇలాంటప్పుడు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎమ్ఆర్) కొన్ని సాధారణ సూచనలు చేసింది. వాటి ఆధారంగా పోషకాహారాన్ని ఈ వయసు పిల్లలకు సరైన మొత్తంలో ఇవ్వాలి. అలాగే, ఆ ఆహారం మనసుకు సంతృపినిచ్చేలా ఉండాలి.

టీనేజ్ పిల్లల బరువు, ఎత్తు, చేసే పనులు.. ఇవన్నీ దృష్టిలో నిపుణుల సలహాతో సమతుల ఆహారాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. ఎక్కువ మొత్తంలో కాకుండా రోజులో 5-6 సార్లు సమయాన్ని బట్టి పైన టేబుల్‌లో ఇచ్చిన హెల్తీ ప్లేట్‌ను తయారుచేసుకోవచ్చు.

బ్రేక్‌ఫాస్ట్
కప్పు గోధుమ ఉప్మా /దోసె - 2 / కిచిడీ - కప్పు / రాగి రొట్టె - 2 -3 / ఇడ్లీ - 2-3 + కప్పు సాంబార్ + ఉడికించిన గుడ్డు లేదా ఆమ్లేట్ + కొద్దిపాటి గింజలు.

ఉదయం స్నాక్స్
పండు (ఆపిల్ లేదా అరటి లేదా నారింజ) + కొద్దిగా డ్రైఫ్రూట్స్ / పల్లీ చిక్కీ / వేపిన శనగలు / వేయించిన అవిసెగింజలు / డ్రై ఫ్రూట్ బార్ / ఉడికించిన వేరుశెనగ

మధ్యాహ్న భోజనం
అన్నం - 1 కప్పు లేదా గోధుమ రొట్టె - 2-3 / తృణ ధాన్యాలు - 1 కప్పు + ఆకుకూరలు - 1 కప్పు + మిక్స్‌డ్ వెజిటబుల్స్ - 1 కప్పు + చికెన్ బ్రెస్ట్ - 100 గ్రా / గుడ్డు - 1 / పనీర్ - 100 గ్రా / చేప - 100-120 గ్రా. + పెరుగు - 1 కప్పు

సాయంత్రం స్నాక్స్
మొలకెత్తిన గింజలు, విత్తనాలు - 30 గ్రా + చియా సీడ్స్ + నిమ్మ రసం/ పాలు/ పండు జ్యూస్ లేదా సూప్.

రాత్రి భోజనం
మధ్యాహ్న భోజనం మాదిరి గానే + గ్రిల్ చేసిన చికెన్ బ్రెస్ట్ అన్నంతో లేదా రొట్టెతో + కూరగాయలు + ఉడికించిన బ్రొకోలీ

కిలో కేలరీలు : అబ్బాయిలకు 2200-3200 : అమ్మాయిలకు 1800 - 2500	
ప్రొటీన్లు : అబ్బాయిలకు - 52 గ్రా. : అమ్మాయిలకు - 46 గ్రా.	
కొవ్వులు (Fat) : 25-35%	
కార్బోహైడ్రేట్స్ : 45-65%	
విటమిన్-ఎ : 600-900 మైక్రోగ్రాములు	
విటమిన్ - సి : 45-75 మి.గ్రా	
కాల్షియం : 1300 మి.గ్రా	నీళ్లు - 8 నుంచి 12 గ్లాసులు



– డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

ఫుడ్ గ్రూప్స్, పరిమాణం

ఏదైనా పండు	- 1 రోజుకు 2-3 సర్వింగ్స్
కూరగాయలు	- రోజుకు 3-5 సర్వింగ్స్ (ఉడికించినవి లేదా వండినవి)
ధాన్యంతో వండినవి	- రోజుకు 6 - 8 సర్వింగ్స్ (1 సర్వింగ్ - ½ కప్పు ఉడికిన అన్నం/సిరిధాన్యం/గోధుమ)
డెయిరీ ఉత్పత్తులు	- రోజుకు 2 - 3 కప్పులు (పాలు, పెరుగు, చీజ్ రూపంలో)
ఆరోగ్యకరమైన కొవ్వులు	- రోజుకు 1 టేబుల్ స్పూన్ (నూనె, గింజలు, విత్తనాలు మొదలైనవి)
ప్రొటీన్ ఆహారం	- మాంసం, గుడ్డు మొదలైనవి (1 సర్వింగ్)

● మన(సు)లో మాట

తీవ్ర మనోవ్యాధికి సంజీవని!

మేము కోయంబత్తూరులో సెటిల్ అయిన తెలుగు వాళ్ళము. మా అబ్బాయి బీటెక్ తర్వాత ఎం. ఎస్. కోసం సంవత్సరం క్రితం అమెరికాకు వెళ్ళాడు. మొదట 6 నెలలు బాగానే ఉన్నాడు. తర్వాత అతని ఆలోచనలు, ప్రవర్తనలు మారాయి. అమెరికాలో ఉన్న పోలీసులు, గూఢాచారులు తనని వెంబడిస్తున్నారని తన మెదడు మీద, ఎలాన్ మస్క్, ట్రంప్ ప్రయోగాలు చేస్తున్నారని అనుమానంతో భయపడుతూ-ఉండేవాడు. ఆ ప్రవర్తన ఎక్కువై బాగా చికాకు చేస్తే అక్కడే ఉండే మా చుట్టాలు 6 నెలల క్రింద ఇండియాకు పంపించారు. ఎయిర్ పోర్టులో దిగాక నేరుగా చెన్నైలో ఒక ఆస్పత్రిలో అడ్మిట్ చేశాము. 'స్కిజోఫ్రినియా' లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, బాగా అగ్రెసివ్‌గా, సూసైడల్ ఆలోచనలతో ఉన్నాడని అక్కడి డాక్టర్లు ఇ.సి.టి. ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. మా ఫ్యామిలీ డాక్టర్‌ని అడిగితే ఆయన ఇ.సి.టి. వల్ల మెదడు దెబ్బతింటుంది, భవిషత్తులో ఇబ్బందులు వస్తాయని చెప్పారని, మేము ఆ ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసి వేరే హాస్పిటల్‌కి తీసుకెళ్లాము. పెద్దగా ఫలితం కనిపించకపోయేసరికి ఇంగ్లీష్ వైద్యం కాకుండా వేరేవైద్యానికి వెళ్ళాము. చాలా రోజులు ఆ మందులు వాడినా ఎలాంటి మార్పూ లేదు. దయచేసి మాకు ఏదైనా మంచి దారి చూపగలరు.

- సోమలింగేశ్వరరావు, కోయంబత్తూరు

చాలామందిలో అంతర్గతంగా ఉండే ఇలాంటి సమస్యను సాక్షి ద్వారా తెలియజేసినందుకు మీకు నా అభినందనలు. మీ అబ్బాయికి వచ్చిన స్కిజోఫ్రేనియా వ్యాధి వలన ఎంతగా సంఘర్షణకి గురయ్యారో అర్థం అవుతోంది. ముందుగా మీరు అర్థం చేస్కోవాల్సింది, మెదడులో వచ్చే కొన్ని రసాయనిక మార్పుల వల్లనే ఇలాంటి మానసిక సమస్యలు వస్తాయని, అవి తగ్గాలంటే ఆ రసాయనాలని సాధారణ స్థితికి తీసుకురావాలనీ మానసిక వైద్యులు మొదటిగా మందులు, కౌన్సెలింగ్ ద్వారా మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తారు.

అయితే కొన్నిసార్లు ఆ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు లేదా పేషెంటుకి ఆత్మహత్య ఆలోచనలు, జబ్బువల్ల ఇతరులకు హాని చేసేంత ఆవేశం, కోపం, ఉన్నప్పుడు, మందులు పని చేయడానికి చాలా సమయం పట్టొచ్చు: అలాంటప్పుడు పేషెంటుకి కుటుంబ సభ్యులకి జరిగే నష్టం ఎక్కువ. దీన్ని నివారించడం కోసం అత్యంత వేగంగా. ప్రభావ వంతంగా పనిచేసే ఒక సంజీవని లాంటి వైద్య విధానమే' ఇ.సి.టి. ఎలక్ట్రో కన్వల్సివ్ థెరపీ. అంతమంచి చికిత్స విధానాన్ని వాడుక భాషలో 'షాక్ ట్రీట్మెంట్' అంటారు. అదే అన్ని సమస్యలకి, అపోహలకి కారణం అయింది. దీనివల్ల మనిషికి ప్రాణహాని అని లేదా నరాలు చచ్చుబడి, సంసారానికి పనికి రారు అని అనేక అపోహలు, సాధారణ ప్రజలతో పాటు, కొంత మంది వైద్యుల్లో కూడా ఉన్నాయి. మన శరీరంలో ఇతర జ్ఞానేంద్రియాలు, కండరాలు ఇతర వ్యవస్థలన్ని పనిచేయడానికి మెదడులో ఉత్పత్తి అయ్యే కరెంట్ చాలా ముఖ్యం. దాన్ని మార్చడం ద్వారా మెదడులోని రసాయనాల అసమతుల్యాను కూడా సరి చేయవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఫోన్ లేదా కంప్యూటర్ కి వైరస్ వచ్చి పని చేయకపోతే రీసెట్ ' బటన్ నొక్కి దాన్ని పనిచేసే కండిషన్‌కి ఎలా తీసుకు వస్తామో ఇ.సి.టి. కూడా మెదడుని అలాగే రీసెట్ చేస్తుంది. దీనివల్ల దీర్ఘకాలికంగా ఎలాంటి సమస్యలు వస్తాయని ఇప్పటి వరకు ఎలాంటి శాస్త్రీయ పరిశోధనా తేల్చలేదు. ఒక పేషెంట్ అన్ని రకాలుగా శారీరకంగా ఫిట్‌గా ఉంటేనే ఇ.సి.టి. చికిత్స చేస్తారు. మీ అబ్బాయిని పరీక్షించిన డాక్టరు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకపోతేనే ఇ.సి.టి. ట్రీట్మెంట్ గురించి చెప్పి ఉంటారు. కాబట్టి ఎలాంటి అపోహలు, భయాలు లేకుండా చికిత్స ఇప్పించి, మీ వాడి జబ్బు లక్షణాలను తొందరగా తగ్గించుకోండి.

మీ అలాగే వాళ్ళు చెప్పినన్ని రోజులు మందులు వాడితే జబ్బు మళ్ళీ తిరిగబెట్టకుండా ఉంటుంది. ఆల్ ది బెస్ట్ !




డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● బయోపిక్

వెండితెరపై కశ్మీర్ కోయిల

మనకు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి తెలుసు.
మహనీయ కర్నాటక సంగీత విద్వాంసురాలు.
లతా మంగేష్కర్ తెలుసు. సినీ సంగీతానికి రారాణి.
కాని రాజ్ బేగం తెలియదు.
ఆమె వీరిద్దరి కాలం నుంచే పాడుతోంది.
వీరితో సమానంగా కశ్మీర్ ప్రజల జేజేలు అందుకుంది.
కశ్మీర్ కోయిల బిరుదు అందుకుంది.
కాని ఆమె దేశానికి తెలియడానికి ఇంత కాలం పట్టింది.
అదికూడా ఇప్పుడు ఆమె జీవితం ఆధారంగా తీసిన 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'
సినిమా అమేజాన్‌లో విడుదల అయ్యాక.



1950ల కాలం ఊహించండి.

కశ్మీర్ పర్వత ప్రాంతం. అక్కడివన్నీ గిరిజన సంప్రదయాలు. కశ్మీర్‌కే తనదైన గొప్ప సంగీతం, గానం, వాయిద్యం, కవిత్వం, గీతం... ఉన్నాయి. అక్కడ కశ్మీరీ భాషలో ఎంతో మంచి సాహిత్యం ఉంది. కాని అక్కడ ఉర్దూ, హిందీ కూడా వాడుకలో ఉంది. నిరంతరం ఏదో ఒక అలజడికి లోనయిన ఆ ప్రాంతంలో స్త్రీలు ఏ పనిలో అయినా ముందుకు రావడం కష్టంగా ఉండేది. వారి కళ కూడా నాలుగ్గోడల మధ్యే తప్ప బహిరంగం కావడానికి లేదు.

ఈ నియమాన్ని బ్రేక్ చేసిన గాయని రాజ్‌బేగం.

1927లో శ్రీనగర్‌లో జన్మించిన రాజ్‌బేగం బాల్యంలోనే పాటను గ్రహించింది. అది అక్కడ కురిసే మంచులా ఆమెలో సహజంగా ఉద్భవించింది. గిరిజన గీతాలు, జానపద పాటలు పెళ్లిళ్లలో పాడటం మొదలు పెట్టింది. 1950లలో ఆమె మొదటిసారి ఆల్ ఇండియా రేడియో కశ్మీర్ స్టేషన్‌లో పాడింది. మరో నాలుగేళ్లకు అదే రేడియోలో స్టాఫర్ అయ్యింది. ఆ తర్వాత బహిరంగ వేదికల మీద పాడసాగింది. తన జీవిత కాలంలో కనీసం రెండు వేల పాటలు ఆమె పాడింది. అయితే దురదృష్టవశాత్తు ఏ పాట రికార్డింగూ అందుబాటులో లేదు.

కశ్మీర్ సంగీతానికి ఆమె చేసిన సేవకు 2002లో 'పద్మశ్రీ' దక్కినా ఆమెకు రావాల్సిన ఖ్యాతి రాలేదు. 2016లో రాజ్ బేగం మరణించింది. జనం ఆమెను అక్కడ నిత్యం తలుచుకుంటూనే ఉంటారు. దేశానికి ఆమె పేరు చేరలేదు. కశ్మీర్‌లో పుట్టి పెరిగి అమెరికాలో చదువుకొని వచ్చిన అక్కడే స్థిరపడ్డ దర్శకుడు డానిష్ రెంజు ఆమె బయోపిక్‌ను తీసే అవకాశం పొందగలిగాడు. రాజ్ బేగం జీవితాన్ని, సంగీతాన్ని 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'గా తీశాడు. అమేజాన్‌లో ఆ సినిమా ఆగస్టు 29 నుంచి స్ట్రీమ్ అవుతూ విమర్శకుల ప్రశంసలు పొందుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ సంగీత అభిమానుల మెప్పు అందుకుంటోంది. దర్శకుడు ఫర్హాన్ అఖ్తర్ ఈ సినిమాకు ఒక నిర్మాత కావడం విశేషం.

***

'అమ్మా... దేవుడు స్త్రీలను పుట్టించింది కేవలం పెళ్లి కోసం కాదు' అని తన యవ్వన కాలం నుంచి తిరగబడుతూ తన దారిని నిర్మించుకుంటుంది రాజ్ బేగం 'సాంగ్స్ ఆఫ్ పారడైజ్' సినిమాలో. పెళ్లిళ్లలో పాడుతూ గుర్తింపు పొందిన రాజ్ బేగం రేడియో కశ్మీర్‌లో ఆడిషన్ ఇవ్వడానికి వెళితే అక్కడంతా అబ్బాయిలే ఉండి 'నువ్వొచ్చావ్ ఏంటి' అన్నట్టుగా చూస్తారు. అయినా వారిని ఎదిరించి ఆడిషన్ ఇచ్చి ఎంపికవుతుంది రాజ్ బేగం. అయితే స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఆమె తన సొంత పేరును చెప్పుకోవడానికి వీలుండదు. 'నూర్ బేగం' పేరుతో రేడియోలో పాడుతుంది. ఇది కొన్నాళ్లకు తెలిసి ఆమె ఊరి వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. ఆడపిల్ల ఇలా మగవాళ్లుండే చోటుకు వెళ్లి పాడటం ఏంటని రాళ్లతో కొడతారు. బహిరంగ వేదికల మీదకు రాకుండా చూస్తారు. రాజ్ బేగం ఇవన్నీ తట్టుకుని తన పాటను జనం వద్దకు తీసుకువెళుతుంది. ఏ జనమైతే ముందు వ్యతిరేకించారో వారంతా ఆమె అభిమానులుగా మారతారు. ఆమెను తమ ప్రాంతపు సాంస్కృతిక రాయబారిగా చేసుకుంటారు. ఆమె పాటలకు పరవశిస్తారు. తన జీవితంలో వేల కొలది పాటలు పాడి రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చింది రాజ్ బేగం. ఆమె వేసిన దారిలో ఇవాళ ఎందరో కశ్మీర్ గాయనులు పాటలు పాడుతున్నారు. రాజ్ ఎదుర్కొన్న వ్యతిరేకత వీరికి లేదు.



'సాంగ్స్ ఆఫ్ పారడైజ్'లో యంగ్ రాజ్ బేగంగా సబా ఆజాద్, వృద్ధ రాజ్ బేగంగా సోని రాజ్‌దాన్ (ఆలియా భట్ తల్లి) నటించారు. సినిమా హిందీ భాషలో సాగినా పాటలు కశ్మీర్ సువాసనలతో ఉంటాయి. కశ్మీర్ జీవితం, సంప్రదాయాలు, మాటా, వరుస... అన్నీ ఈ సినిమాలో కనిపిస్తాయి.

ఇన్నాళ్లకు కశ్మీర్ సినిమా ఒకటి వచ్చింది.

అది ఒక గాయని గురించి కావడం సంతోషపడవలసిన సంగతి.

కళ మరణించదని మరో సారి నిరూపితమైంది.



● పద్మశ్రీ అందుకుంటున్న రాజ్ బేగం

● పేరెంటింగ్

ఒక హీరో గురించి...

పిల్లలకు ఎప్పుడూ బడి పాఠాలే కాదు బతుకు పాఠాలు, నైతిక విలువల గురించి కూడా చెప్పాలి. అదే నిజమైన పేరెంటింగ్. ఒక తండ్రి తన పిల్లాడికి సులువైన భాషలో మంచీచెడుల గురించి చెప్పిన మాటలు నెటిజనులకు తెగ నచ్చాయి.

ఫైనాన్షియల్ సర్వీసెస్ 'మైఫండ్‌బాక్స్' సీయీవో అనూజ్ పాల్...

'నీ గురించి స్కూల్‌లో ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా?' అని తన చిన్నారిని అడిగాడు.



'నేను ఒకరిని కొట్టాను' అన్నాడు అద్వైక్.

'ఎవరిని కొట్టావు? ఎందుకు కొట్టావు?' అని అడిగిన తండ్రి... 'ఒక అమ్మాయిని అలా కొట్టవచ్చా?

నువ్వు ఆ అమ్మాయి వస్తువు లాగేసుకున్నావు. ఇతరుల వస్తువులు అలా లాక్కోవచ్చా? మీ క్లాస్‌మేట్స్ ఇద్దరు కలిసి నిన్ను కొట్టారనుకో, నీకు బాధగా అనిపించదా? వాళ్లు చేసింది తప్పు అనిపించదా... ఇది సరే, నువ్వు భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నావు? హీరో అవుతావా? విలన్ అవుతావా?' అని అడిగాడు అనూజ్.

'హీరో' అని జవాబు చెప్పాడు అద్విక్.

'తప్పు చేసినప్పుడు సారీ చెప్పేవారే నిజమైన హీరోలు. మరి నువ్వు సారీ చెబుతావా?' అని అడిగాడు తండ్రి. అద్విత్ ఆ అమ్మాయికి 'సారీ' చెప్పాడు! ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

● టెక్నో ఉమెన్

ఛాయా చిత్రం



'మెటా'లో దశాబ్దకాలం పాటు పనిచేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్ ఛాయ నాయక్ తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ'లో చేరింది. ఓపెన్ ఏఐలో ఆమె 'స్పెషల్ ఇనిషియేటివ్స్' టీమ్‌లో పనిచేయనుంది.

'సరియైన సమయంలో సరియైన నిర్ణయం' అని కంపెనీ మార్పు గురించి స్పందించింది ఛాయ. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఛాయ నాయక్ సెక్యూరిటీ, పీస్ స్టడీస్‌లో డిగ్రీ చేసింది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పబ్లిక్ పాలసీ, డాటా సైన్స్‌లో మాస్టర్స్ ప్రోగ్రామ్ చేసింది. పుణేలో 'పాత్‌వేస్ టు ఎంపవర్‌మెంట్'లో ప్రాజెక్ట్ మెనేజర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించింది. ఎన్విరాన్‌మెంటల్ సస్టెయినబిలిటీ కార్యాలయం(యూఎస్)లో జియోగ్రాఫిక్ ఇన్‌ఫర్‌మేషన్ స్పెషలిస్ట్‌గా పనిచేసింది. 'ది ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫ్యూచర్'లో కన్సల్టెంట్‌గా, యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో గ్రాడ్యుయేట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన ఛాయ ఆ తరువాత డాటా-డ్రివన్, సోషల్ ఇంపాక్ట్ ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టింది. 'మెటా'లో 'డాటా ఫర్ ఇనిషియేటివ్' హెడ్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. ఫేస్‌బుక్‌లో ఓపెన్ రీసెర్చ్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ(ఫోర్ట్) హెడ్‌గా పనిచేసింది. 'ఓపెన్ ఏఐ'లోకి రావడానికి ముందు ఫేస్‌బుక్‌లో జనరేటివ్ ఏఐ ప్రాజెక్ట్ మెనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. 'మెటాలోని తొలి రోజులు నిన్నా మొన్నా జరిగినట్లే అనిపిస్తున్నాయి. మెటాలో పని చేసిన అనుభవం నా కెరీర్‌కు గట్టి పునాది వేసింది' అంటుంది ఛాయ. 'నా ప్రయాణం ఆగిపోలేదు. పుస్తకంలో ఒక పేజీని తిప్పాను. అంతే!' అని లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో కంపెనీ మార్పు గురించి రాసింది ఛాయానాయక్.

● డిజిటల్ అలర్ట్

అలా... ఆమె ప్రాణాలు కాపాడారు!



ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలికి చెందిన అమ్మాయి ఒకరు 'నేను ఆత్మహత్య చేసుకోబోతున్నాను' అని అర్ధరాత్రి దాటిన తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. 'మెటా' వెంటనే ఈ పోస్ట్‌ను స్టేట్ పోలీస్ మీడియా సెంటర్‌కు పంపి పోలీసులను అలర్ట్ చేసింది. కేవలం పదహారు నిమిషాల వ్యవధిలో ఒక సబ్-ఇన్‌స్పెక్టర్, కొందరు మహిళా పోలీసులు ఆ అమ్మాయి ఉన్న ఇంటికి చేరుకున్నారు. వాంతులు చేసుకున్న ఆ అమ్మాయి నిస్తేజంగా పడి ఉంది. వెంటనే ఆమెను హస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

సమయానికి ఆస్పత్రికి తీసుకురావడం వల్ల ఆ అమ్మాయి చావు నుంచి బయటపడింది. ఆమె కోలుకున్న తరువాత... 'ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావు?' అని అడిగితే... తాను ప్రేమించిన వ్యక్తి మాట్లాడడం మానేశాడని, తన ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని...ఇలా చెప్పుకుంటూ పోయింది.

పెరుగుతున్న ఆన్‌లైన్ సుసైడ్ అటెంప్ట్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు, మెటా భాగస్వామ్యంతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో సుడైడ్-రిలేటెడ్ పోస్ట్‌లపై నిఘా పెడుతున్నారు. వెంటనే రంగంలోకి దిగుతున్నారు. జనవరి 1, 2023 నుంచి ఆగస్ట్ 25, 2025 వరకు 1,315 మంది ప్రాణాలను కాపాడారు.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 3న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,06,810	1,08,950	1,06,970	1,08,950	1,07,200	1,06,960
బంగారం (22 క్యారెట్లు)	99,890	98,050	98,050	1,00,990	98,620	98,050
వెండి	1,27,000	1,26,300	1,37,000	1,26,300	1,26,000	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.